క్లుప్తంగా

స్టడీ మెటీరీయల్ అందజేత



లైబ్రేరియన్ రామారావుకు పుస్తకాలు అందజేస్తున్న ధీరా ఫౌండేషన్ ప్రతినిధులు

గుర్ల: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ స్టడీ మెటీరీయల్‌ను అందజేసినట్లు లైబ్రేరియన్ పి.రామరావు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేరవుతున్న నిరుద్యోగ యువతకు ఉపయోగపడే వివిధ రకాల పుస్తకాలు ఉచితంగా అందించినట్లు చెప్పారు. ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌కు లైబ్రేరియన్ రామారావు, నిరుద్యోగులు, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.

60 మందికి వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో 104 ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మందికి వైద్య సేవలు అందించినట్లు మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ తెలిపారు. జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, దగ్గు తదితర వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు చెప్పారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



బూరాడ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని పూతికవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బూరాడ శ్రీనివాసరావు శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి పనిచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, తదితరులు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సేవలే గుర్తింపునిస్తాయి



బదిలీపై వెళుతున్న ఉద్యోగులను సత్కరిస్తున్న జె.గుమడాం సర్పంచ్

బొండపల్లి: అధికారులు ఎక్కడ పనిచేసినా వారు ప్రజలకు అందించిన సేవలే వారికి తగిన గుర్తింపునిస్తాయని జె.గుమడాం గ్రామ సర్పంచ్ మంత్రి చిన్నమ్మలు అన్నారు. పంచాయతీ కార్యదర్శి వాడ్డ సింహాచలం, వీఆర్వో మారోతు త్రినాథ్ బదిలీపై వెళ్లడంతో శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు మంత్రి గోవింద, టీడీపీ నాయకులు మంత్రి నారాం నాయుడు, పొట్నూరు ఆదినారాయణ, లెంకలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్ గ్రూపు సభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని అలక్‌నంద కాలనీలో ఉంటున్న 30 మంది పేదలకు చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ గ్రూపు ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విజయనగరం డివిజనల్ పీఆర్వో జానకమ్మ, రాష్ట్ర సైనిక బోర్డు అసిస్టెంట్ డైరెక్టరు వి.వి.రాజారావు, తదితరుల చేతులమీదుగా సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ మేనేజర్ రమణ, నారాయణరాజు, చిన్నారావు, గోవిందరాజులు, హరనాథరావు పాల్గొన్నారు.

హెచ్‌సీ కుటుంబానికి చేయూత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేసి, ఇటీవల మృతిచెందిన హెచ్‌సీ కుటుంబానికి పోలీస్ సిబ్బంది సేకరించిన మొత్తాన్ని చేయూత కింద ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో అందజేశారు. రేగిడి ఆముదాలవలస పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేసిన పి. నారాయణరావు ఆగస్టు 30న అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య పార్వతమ్మకు రూ. 49 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందేంత వరకు పోలీసుశాఖకి చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కొంతమొత్తాన్ని సేకరించి బాధిత కుటుంబాలకు చేయూతగా అందజేయడం అభినందనీయమన్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో పనిచేస్తున్న పలువురు అధికారులు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లారు. వారి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి ఆయా కార్యాలయాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తామని అన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శోభారాణి



గజపతినగరం: గజపతినగరం డిప్యూటీ తహసీల్దార్‌గా సీహెచ్ శోభారాణి బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన సత్యనారాయణ దత్తిరాజేరు మండలానికి బదిలీపై వెళ్లారు. అలాగే ఎలక్షన్ డీటీగా పనిచేసిన సతీష్‌కుమార్ బదిలీపై విజయనగరం వెళ్లారు. ఆయన స్థానంలో వెంకటలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. వారితో పాటు పలువురు వీఆర్‌ఓలు కూడా బదిలీపై ఇతర చోట్లకు వెళ్లారు.

మెరకముడిదాం ఎంపీడీఓగా భాస్కరరావు



మెరకముడిదాం: మండలంలో పలువురు అధికారులు బదిలీపై వెళ్లారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ) ఎం.రత్నం బదిలీపై రామభద్రపురం మండలానికి వెళ్లారు. ఆ స్థానంలో గరివిడి మండలం ఎంపీడీఓగా పనిచేసిన జి.భాస్కరరావు బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా ఈఓపీఆర్డీ పుష్పారావు బలిజిపేట మండలానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కొత్తవలస నుంచి కత్తి ధర్మారావు రానున్నారు. పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ గరివిడి మండలానికి బదిలీపై వెళ్లారు. అదేవిధంగా చినబంటుపల్లి, భైరీపురం, బుధరాయవలస పంచాయతీల కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో గరివిడి నుంచి ఐదుగురు కార్యదర్శులు బదిలీపై వచ్చి జాయిన్ అయ్యారు.

జామి ఎంపీడీఓగా అప్పలనాయుడు



జామి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నీలం అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన ఎం.సతీష్ ఎస్.కోట మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో భోగాపురం మండల ఎంపీడీఓగా పనిచేసిన అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వేపాడ ఎంపీడీఓగా సూర్యనారాయణ



వేపాడ: మండల ఎంపీడీఓగా సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మక్కువ మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే వేపాడ మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా ఎస్.మహేష్, జూనియర్ అసిస్టెంట్‌గా డి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన శ్రీకాంత్ ఎల్.కోట మండలంకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బొండపల్లి ఎంపీడీఓగా గిరిబాల



బొండపల్లి: ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన గిరిబాలను అభినందిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: బొండపల్లి ఎంపీడీఓగా జి.గిరిబాల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లిమర్ల మండలం ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ దత్తిరాజేరు మండలానికి బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్‌గా వి.రాజేశ్వరరావు ఎల్.కోట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ డీటీగా పనిచేసిన పి.హరి కొత్తవలస మండలానికి బదిలీపై వెళ్లారు. అలాగే పంచాయతీరాజ్ జేఈగా పి.అప్పలనాయుడు, జూనియర్ సహాయకులుగా సంతోష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు ఎంపీపీ చల్లా చలంనాయుడు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

వెలుగు ఏపీఎంగా సూర్యనారాయణ



వేపాడ: వెలుగు ఏపీఎంగా డి.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎల్.కోట మండలంలో నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇదివరకు ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో కొత్తవలస ఏపీఎం ఎ.వెంకటరమణ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించేవారు.

మండల సర్వేయర్‌గా సుబ్రహ్మణ్యం

దత్తిరాజేరు: రెవెన్యూ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా సుబ్రహ్మణ్యం పంతులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. రైతులు, ఉన్నతాధికారుల సహకారంతో మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సీఎస్‌డీటీగా గజపతినగరం నుంచి బదిలీపై వచ్చిన సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు.

ఎంపీడీఓగా బి.కళ్యాణి బాధ్యతల స్వీకరణ



గజపతినగరం: గజపతినగరం ఎంపీడీఓగా బి.కళ్యాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గుర్ల మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ కిశోర్‌కుమార్ భోగాపురం మండలానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

దత్తిరాజేరు ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్



దత్తిరాజేరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వైపీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బొండపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగుల సహకారంలో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు.

ఎల్.కోట ఎంపీడీఓగా అప్పారావు



లక్కవరపుకోట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన కె.రూపేష్ పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కురుపాం ఎంపీడీఓగా పనిచేసిన అప్పరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

బాలా త్రిపురసుందరిగా కనకమహాలక్ష్మి



చీపురుపల్లి: బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



జామి: పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ అమ్మవారు

చీపురుపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు రెండో రోజు శుక్రవారం బాలా త్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి

బొండపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గకు ప్రత్యేక పూజలు

జామి: మండల కేంద్రమైన జామిలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భగవాన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కలువ పువ్వులతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.



చీపురుపల్లి: సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



బొండపల్లి: గాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎంఈఓ జయశ్రీ

జామి: వృత్తి విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవచ్చని ఎంఈఓ జయశ్రీ అన్నారు. జామి ఉన్నత పాఠశాలలో శుక్రవారం వృత్తి విద్యపై ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. వృత్తి విద్య అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను వివరించారు. ఆటోమొబైల్ కోర్స్ పూర్తిచేసిన 14 మంది విద్యార్థులకు స్థానికంగా ఉన్న మెకానికల్ షోరూంలో ఇంటర్న్‌షిప్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయుడు కె.అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్‌లో పెదనడిపల్లి విద్యార్థుల సత్తా



క్రీడాకారులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న రోటరీక్లబ్ గవర్నర్, తదితరులు

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలోని రోటరీక్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. రోటరీక్లబ్ నవతరోత్సవం అనే కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించింది. పోటీలోల విజేతలకు అక్టోబర్ 2న నవతరోత్సవం సందర్భంగా బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో టెన్నీకాయిట్ బాలికల సీనియర్ విభాగంలో పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.హైమ, బి.గీత ప్రథమ స్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో దీపిక, జ్యోత్స్న ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలుర జూనియర్స్ విభాగంలో కె.జశ్వంత్, కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు రోటరీక్లబ్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిని విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రామారావు అభినందించారు.


సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కార్యదర్శులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ సూర్యఘర్ పథకం ఆవశ్యకత వివరించాలన్నారు. విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2024 ఫిబ్రవరి 13న ప్రారంభించారని చెప్పారు. 2026 - 27 నాటికి ఈ పథకం పూర్తిగా విజయవంతం కావాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సహజసిద్ధంగా ఉత్పన్నమయ్యే సోలార్ ఎనర్జీ వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని తెలిపారు. జిల్లాలో లక్ష మందితో సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతినెలా కనీసం 300 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చేలా కృషి చేయాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం 1కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు రూ. 30,000, 2 కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు రూ.60,000, 3 కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు 78,000 రూపాయలను రాయితీగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ త్రినాథరావు, డీఈఈ కిరణ్‌కుమార్, టీపీఆర్‌ఓ సింహాచలం, సీఎంఎం సన్యాసిరావు పాల్గొన్నారు.



హాజరైన కార్యదర్శులు,సీఓలు

మత్తు పదార్థాల నిర్మూలనకు 'సంకల్పం'



చీపురుపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ దామోదర్, గ్రామస్తులు

చీపురుపల్లి: జీవితాలను నాశనం చేసే మాదకద్రవ్యాలు జోలికి వెల్లబోమని ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని ఎస్‌ఐ ఎల్.దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మండలంలోని పి.కె.పాలవలస గ్రామంలో శుక్రవారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో 'సంకల్పం' పేరుతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత మత్తు పదార్థాల బానిసై బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని కోరారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో..

శృంగవరపుకోట: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని యువత సంకల్పం చేయాలని ఎస్.కోట సీఐ ఎస్.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని, భవిష్యత్ నాశనమవుతుందని అన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ, కంప్లయింట్ బాక్స్ ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎస్.కోట ఎస్సైలు గంగరాజు, భాస్కర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

గజపతినగరం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై కె.లక్ష్మణరావు సూచించారు. గజపతినగరం దిగువ వీధిలో శుక్రవారం రాత్రి 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, సారా, గుట్కా, ఖైనీ వంటి మత్తుపదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని యువతకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎస్.వి.రమణమూర్తి



గజపతినగరం: మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణరావు

ఏపీటీఎఫ్ మహా సభలను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదాశివరావు

నెల్లిమర్ల: ఈ నెల 6,7,8 తేదీల్లో విజయనగరం పూల్‌బాగ్ రోడ్డులోని జగన్నాథ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్. చిరంజీవిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సభలకు ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువత హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐఎఫ్‌ఈఏ జాతీయ ఉపాధ్యక్షుడు వై. సత్యం, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ. సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు బలరామ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ పైడిరాజు, సహాధ్యక్షురాలు ఎన్ శ్రీదేవి, సంఘ నాయకులు ఏవీ శ్రీనివాసరావు, యు. శ్రీనివాసరావు, కె. బాలకృష్ణ, సీహెచ్ పైడితల్లి, చినసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లేక ఇక్కట్లు...



ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు పనుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టిందే తప్ప ఆచరణలో అందించలేకపోయిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ప్రభుత్వం తీరుకు నిరసనగా జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం